క్లుప్తంగా

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



సారవకోటలో ఆరోగ్యశ్రీ కార్డు అందజేస్తున్న డీఎల్‌పీఓ రమణమూర్తి

సారవకోట: కొత్తగా మంజూరైన ఆరోగ్యశ్రీ కార్డులు లబ్ధిదారులకు అందజేసే సమయంలోనే వారితో బయోమెట్రిక్ వేయించాలని డీఎల్‌పీఓ ఐ.వి.రమణమూర్తి సూచించారు. మండలంలోని సారవకోట, అలుదు, కుమ్మరిగుంట గ్రామాల్లో జరుగుతున్న ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని శనివారం పరిశీలించారు. ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.25 లక్షలు కేటాయించనుందని, దీని కోసమే కొత్తగా ఆరోగ్యశ్రీ కార్డులు అందజేస్తున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు సింహాచలం, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న జగన్నాథ్ పూరి

మెళియాపుట్టి: మండల కేంద్రానికి చెందిన ఎడ్లపల్లి జగన్నాథ్ పూరి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ సెన్సెస్ ఆపరేషన్ విభాగంలో స్టాటికల్ ఇన్విస్టిగేటర్‌గా పనిచేస్తున్నారు. ఎనలైటినింగ్ ఆన్ రిలయబుల్ ఎస్టిమేట్, సస్టెనబుల్ గ్రోత్ ఆఫ్ వైటల్ స్టాటిస్టిక్స్ సిస్టం ఇన్ ఇండియా (ముఖ్యమైన అంచనాలు, గణాంకాల వ్యవస్థ యొక్క స్థిరమైన వృద్ధిపై అవగాహన కల్పించడం) అనే అంశంపై రీసెర్చ్ చేసినట్లు జగన్నాథ్ పూరి శనివారం తెలిపారు. జగన్నాథ్ పూరికి తల్లిదండ్రులు కృష్ణారావు, దమయంతి, స్నేహితులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

గుణాత్మక విద్య అందించాలి



మాకివలసలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ మాధవరావు

జలుమూరు: విద్యార్థులకు గుణాత్మకమైన విద్య అందించాలని ఎంఈఓలు బి.మాధవరావు, ఎం.వి.ఆర్.ప్రసాదరావు అన్నారు. మాకివలస, టెక్కలిపాడు యూపీ పాఠశాలలను శనివారం సందర్శించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలపై పలు ప్రశ్నలు అడిగి వారికి బోధించే తీరును పరిశీలించారు. విద్యా సంవత్సరం ముగుస్తున్న తరుణంలో విద్యార్థులు ఏయే అంశాలు, సబ్జెక్టుల్లో వెనకబడి ఉన్నారో గుర్తించాలని ఉపాధ్యాయులకు సూచించాన్నారు. హెచ్‌ఎం లక్ష్మణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భీష్మ ఏకాదశి యాత్ర ప్రారంభం రేపు



ముస్తాబైన శివాలయం

కొత్తూరు: మండలంలోని పారాపురం గ్రామంలో పురాతనమైన స్వయంభూ శివాలయంలో ఈ నెల 19 నుంచి 23 తేదీ వరకు భీష్మ ఏకాదశి యాత్ర మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. ఐదు రోజులపాటు ఆలయంలో శివునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. ఆధ్యాత్మిక, పౌరాణిక, జానపద నాటక ప్రదర్శలు ఉంటాయన్నారు. యాత్ర సందర్భంగా శివాలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. యాత్ర మహోత్సవానికి ప్రతిఒక్కరూ హాజరుకావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన వాహనం



రోడ్డుపైకి వరిగిన విద్యుత్ స్తంభం

ఎల్.ఎన్.పేట: మండలంలోని తురకపేట సెంటర్‌లో ఆలికాం-బత్తిలి (ఏబీ) ప్రధాన రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని శుక్రవారం అర్ధ రాత్రి తరువాత గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. విద్యుత్ స్తంభం రోడ్డుపైకి వాలిపోయింది. వైర్లు తెగిపోవటంతో తురకపేట సెంటర్‌లోని పలు వీధులకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ స్తంభం పడిపోకుండా సిబ్బంది తాడు కట్టారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. విద్యుత్ స్తంభాన్ని మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ తెలిపారు.

కార్పొరేట్‌కు దీటుగా..

- సర్వాంగ సుందరంగా పురుషోత్తపురం ఉన్నత పాఠశాల
- నాడు-నేడు నిధులు రూ.38 లక్షలతో అభివృద్ధి



సుందరంగా తయారైన పాఠశాల భవనం (నేడు)



మరుగుదొడ్ల దుస్థితి (నాడు)



మెరుగుపడిన మరుగుదొడ్లు (నేడు)



శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం (నాడు)



నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్‌కు దీటుగా ఉన్నాయి. సరుబుజ్జిలి మండలంలోని పురుషోత్తపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనాలను నాడు-నేడు ద్వారా రూ.38లక్షలు వెచ్చించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. గతంలో వర్షం వస్తే గదులన్నీ నీటితో నిండిపోయేవి. విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్లు సదుపాయాలు సక్రమంగా ఉండేవికావు. ప్రస్తుతం చేపడుతున్న పనులు చిరస్థాయిగా నిలచిపోతాయి. గతంలో కంటే హైస్కూల్‌లో ప్రవేశాలు పెరగడమే మార్పునకు నిదర్శనం. ప్రశాంతమైన వాతావరణంలో పాఠాలు చెప్పే స్థితికల్పించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందనలు తెలియజేస్తున్నారు.

– సరుబుజ్జిలి

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



బూర్జ: మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ గీత

బూర్జ: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురపు రామారావు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం బూర్జ ఐసీడీఎస్ సీడీపీఓ ఎస్.గీత ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ బాలల సంక్షేమం, రక్షణ, బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలన్నారు. సీడీపీఓ మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు తెలియజేశారు. మండల స్థాయి బాలల సంక్షేమం, రక్షణ కమిటీ, బాల్య వివాహాల నిరోధక కమిటీలు ఏర్పాటు చేశారు. ఈ కమిటీలకు చైర్‌పర్సన్‌గా ఎంపీపీ కర్నేన దీప, కన్వీనర్‌గా ఐసీడీఎస్ సీడీపీఓ ఎస్.గీత, కమిటీ సభ్యులుగా మండల అధికారులను నియమించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల రక్షణ విభాగం సోషల్ వర్కర్ ఐ.జనార్దన, ఎ.గీత, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

పొందూరు: బాల్య వివాహ నిరోధక చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని బాలల రక్షణ విభాగం జిల్లా న్యాయ పర్యవేక్షణ అధికారి ఆర్.లక్ష్మణమూర్తి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాయలంలో బాల్య వివాహాల నిరోధక, పర్యవేక్షక కమిటీలను శనివారం ఏర్పాటు చేసిన సందర్భంగా మాట్లాడారు. జీఓ నంబర్ 31, పోక్సో యాక్ట్, రక్షణ, సంరక్షణకు అవసరమైన హెల్ప్‌లైన్ 1098 వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సీడీపీఓ ఈశురాధ, ఈఓపీఆర్డీ సింహాచలం, ఎంఈఓ పి.వి.రామరాజు, ఏపీఎం గురుగుబెల్లి శ్యామలరావు, వైద్యాధికారులు రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర ప్రణాళికతో గ్రామాభివృద్ధి



బడ్జెట్ సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ తమ్మినేని శారద

ఆమదాలవలస రూరల్: సమగ్ర ప్రణాళికలతో గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామని ఎంపీపీ తమ్మినేని శారద అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారు. 2024–25 ఏడాదికి అమలు చేయనున్న బడ్జెట్‌కు ఎంపీటీసీ సభ్యులంతా ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి బడ్జెట్ ఎంత అవసరమో, మండల స్థాయిలోనూ బడ్జెట్ నిర్వహించుకోవడం వల్ల గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించడానికి వీలుకలుగుతుందన్నారు. బడ్జెట్ సవరణ, అంచనాల వల్ల ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. బడ్జెట్‌తోనే దేశ ఆర్థిక వ్యవస్థ ముడిపడి ఉంటుందన్నారు. 2023–24 ఏడాదికి ఆదాయం రూ.60.96 కోట్లు, వ్యయం రూ.60.95 కోట్లు జరిగినట్లు లెక్కలు చూపారు. 2024–25 ఏడాదికి ఆదాయం రూ.60.96 కోట్లు, వ్యయం రూ.60.95 కోట్లు అవుతుందని అంచనా వేశారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు బెండి గోవిందరావు, వైస్ ఎంపీపీ సోమరాజు జగన్నాథం, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తరువాత పాతపట్నం నియోజకవర్గం అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పాతపట్నంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తలసరి ఆదాయంలో రాష్ట్రంలోనే అట్టడుగున ఉన్న పాతపట్నం నియోజకవర్గం సీఎం జగన్ కృషితోనే అభివృద్ధి చెందిందన్నారు. ఐదు మండలాల్లోనూ ప్రధాన రహదారుల అభివృద్ధికి అవవసరమైన నిధులు మంజూరు చేశారన్నారు. రూ.265 కోట్లతో ఐదు మండలాల ప్రజలకు వంశధార తాగునీరు అందించి దాహార్తిని తీర్చేందుకు నిధులు విడుదల చేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. ఈ నెల 19న తాగునీటి పథకం పనులకు శంకుస్థాపన చేస్తామన్నారు. వంశధార నిర్వాసితులకు రూ.216.71 కోట్ల అదనపు పరిహారం విడుదల చేశారని గుర్తుచేశారు. ఎన్నో దశాబ్దాలుగా పాతపట్నం మండలంలోని కాగువాడ, కరసవాడ, బూరగాం తదితర సుమారు 30 గ్రామాల ప్రజలు ఎదురుచూస్తున్న వంతెన నిర్మాణం జగనన్న పాలనలోనే పూర్తిచేయటం జరిగిందన్నారు. కొరసవాడ వద్ద మహేంద్రతనయ నదిపై సుమారు రూ.9 కోట్ల ఖర్చుతో వంతెనతో పాటు రోడ్డు నిర్మాణం జరిగిందన్నారు. ఈ ప్రాంత రైతుల చిరకాల కోరిక తీరిందన్నారు. మెళియాపుట్టి మండలంలోని కేరాసింగి, చందనగిరి పర్వత శిఖరాలపై ఉన్న గిరిజనులకు రూ.7 కోట్ల ఖర్చుతో మెరుగైన రహదారి సౌకర్యం కల్పించటం జరిగిందన్నారు. అన్నివర్గాల వారికి సంక్షేమ పథకాలు అందించిన జగనన్నను మరోసారి సీఎంగా గెలిపించాలని ప్రజలను కోరారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



మాట్లాడుతున్న టెక్కలి డీఎల్‌పీఓ రమణ



పెద్దలోగిడిలో డ్రాఫ్ట్ ప్లాన్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

- టెక్కలి డీఎల్‌పీఓ రమణ

పాతపట్నం: గ్రామ పంచాయతీల్లో 15వ ఆర్థిక సంఘం నిధులతో తాగునీరు, పారిశుద్ధ్యం మెరుగు తదితర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఉపయోగించాలని టెక్కలి డీఎల్‌పీఓ ఐ.వి.రమణ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పాతపట్నం, మెళియాపుట్టి మండలాల పంచాయతీ కార్యదర్శులతో 15వ ఆర్థిక సంఘం నిధులు ఖర్చు, ప్రణాళికలపై శనివారం సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల డ్రాఫ్ట్ ప్లాన్‌ను ఎలా తయారు చేయాలి, ఆర్థిక సంఘం నిధులు వినియోగం ఎలా చేయాలనే అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం పెద్దలోగిడి గ్రామ పంచాయతీని సందర్శించారు. రికార్డులు, పంచాయతీ ప్రణాళిక డ్రాఫ్ట్ ప్లాన్‌ను పరిశీలించారు. ఈఓపీఆర్డీ కృష్ణారావు, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

20 నుంచి పోలాకి జాతర

పోలాకి: ఈ నెల 20వ తేదీ నుంచి పోలాకి కనక దుర్గాభవాని అమ్మవారి 22వ జాతర మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఆలయ ధర్మకర్తల కమిటీ సభ్యులు టంకాల శ్రీరాములు, పల్లి రాజు శనివారం తెలిపారు. ఐదురోజులపాటు నిర్వహించే జాతర కోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. తొలిరోజు అమ్మవారి రథయాత్రతోపాటు ఐదు రోజులపాటు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక హోమం నిర్వహించనున్నట్లు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

స్పందించిన దాతలు

పొందూరు: ఈ నెల 5న సాక్షిలో ప్రచురించిన 'తల్లిదండ్రులు దూరం భవిత భారం' కథనానికి దాతలు స్పందించారు. ఇప్పటివరకు రూ.3 లక్షల వరకు నగదును అందించారు. గత నెల 17న విశాఖ జిల్లా ఆనందపురం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు పలువురు బాసటగా నిలుస్తున్నారు. మరింత మంది దాతలు సహకరించేందుకు ఈ నంబర్ 99124 74529కు ఫోన్ పే చేయాలని చిన్నారుల బంధువులు కోరుతున్నారు.

ఓటర్ల జాబితాల్లో తప్పులు లేకుండా చూడాలి



ఓటర్ల జాబితాలను పరిశీలిస్తున్న పార్టీ నాయకులు

ఎల్.ఎన్.పేట: ఓటర్ల జాబితాల్లో తప్పులు లేకుండా సిద్ధం చేయాలని మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పెనుమజ్జి విష్ణుమూర్తి, పీఏసీఎస్ అధ్యక్షుడు కొల్ల కృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఓటర్ల జాబితాలను శనివారం పరిశీలించారు. మృతి చెందిన, రెండు సార్లు నమోదైన, వివాహం జరిగి అత్తవారి ఇంటికి వెళ్లిన వారి ఓట్ల వివరాలు పరిశీలించారు. అలాంటి ఓటర్లను గుర్తించి అధికారులకు తెలియజేస్తామన్నారు. పార్టీ నాయకులు లోచర్ల మల్లేశ్వరరావు, ఎర్ర జనార్దన తదితరులు పాల్గొన్నారు.

20న వలంటీర్లకు సత్కారం

పాతపట్నం: మండలంలోని 18 గ్రామ సచివాలయ పరిధిలో పనిచేస్తున్న 421 మంది గ్రామ వలంటీర్లకు సేవా పుస్కారాలను ప్రభుత్వం అందజేస్తుందని ఎంపీడీఓ కె.వెంకన్నబాబు శనివారం తెలిపారు. ఈ నెల 20న ఎమ్మెల్యే రెడ్డి శాంతి చేతుల మీదుగా వలంటీర్లకు పురస్కారాలు అందజేస్తామన్నారు. మండలంలోని బద్దుమర్రి, కాగువాడ, పెద్దలోగిడి, రొంపివలస, సీది గ్రామ సచివాలయాలకు చెందిన ఒక్కో వలంటీర్ సేవా రత్నా పురస్కారానికి ఎంపికయ్యారన్నారు.

21న కొత్తూరులో..

కొత్తూరు: మండలంలోని 27 గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామ వలంటీర్లు అందిస్తున్న సేవలను పురస్కరించుకుని ఈ నెల 21న సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ త్రివిక్రమరావు శనివారం తెలిపారు. ఈ కార్యక్రమం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం 11 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సైన్స్ ప్రాజెక్టుల తయారీతో విజ్ఞానం



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీధర్

పాతపట్నం: సైన్స్ ప్రాజెక్టుల తయారీతో విజ్ఞానం కలుగుతుందని ఎంఈఓలు బి.శ్రీధర్, సి.హెచ్.తిరుమలరావు అన్నారు. స్థానిక రవీంద్ర భారతి పాఠశాలలో శనివారం నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పో సంబారాలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మకతకు పదును పెట్టారన్నారు. లైట్ హౌస్, ఎస్కలేటర్, ప్రొజెక్టర్, ఎల్.డీ.ఆర్, సేంద్రియ ఎరువులు ఏటీఎం మెషిన్, హైడ్రో ఎలక్ట్రిసిటీ వంటి ప్రదర్శనలను ఎంఈఓలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల అధ్యాపకుడు కామేశ్వరరావు, ప్రిన్సిపాల్ బి.ప్రభాకర్, జోనల్ ఇన్‌చార్జి ఎస్.వెంకటేష్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వలంటీర్లే రథ సారథులు



వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- సీఎంగా మళ్లీ జగనన్ననే చేసుకుందాం..
- వలంటీర్లుకు వందనం కార్యక్రమంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: గ్రామ వలంటీర్లందరూ బాధ్యతగా పని చేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకువచ్చారని, ప్రభుత్వానికి, ప్రజలకు వారధులుగా ఉంటున్నారని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నరసన్నపేట మేజరు పంచాయతీ పరిధిలోని 126 మంది వలంటీర్లకు సత్కార కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలందరికీ ఇదే విధంగా సంక్షేమ పథకాలు అందాలన్నా.. మీరు వలంటీర్లుగా కొనసాగాలన్నా మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అయితేనే సాధ్యమని, దీనికి ప్రతీ వలంటీర్ బాధ్యతగా పనిచేయాలని సూచించారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో బాగాపని చేసి మన ప్రభుత్వానికి దేశంలోనే మంచి పేరు వచ్చేందుకు కృషి చేశారన్నారు. రానున్న ఎన్నికలు వైఎస్సార్‌సీపీకి ఎంతో కీలకమని, ఈ రోజునుంచే కష్టపడి పని చేయాలన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించామని, వారందరికీ జగనన్న పాలన గురించి వివరించాలన్నారు. పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య మాట్లాడుతూ.. వలంటీర్లు రానున్న మూడు నెలలూ మరింత బాగా పనిచేయాలన్నారు. మీకు ఎటువంటి కష్టం, ఇబ్బంది కలిగినా తన దృష్టికి తీసుకురావచ్చని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ అధ్యక్షుడు కరిమి రాజేశ్వరరావు, ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, సర్పంచ్ బూరల్లి శంకర్, సొసైటీ అధ్యక్షుడు పొన్నాన దాలినాయుడు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరరావు, నాయకులు కేసీహెచ్‌బీ గుప్త, జోగారావు, పాగోటి రాజారావు, సదాశివుని కృష్ణ, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓల పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఈఆర్‌ఓ రామ్మోహనరావు

నరసన్నపేట: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ బూత్ స్థాయి ఆఫీసర్లు(బీఎల్‌ఓ) పాత్ర చాలా కీలకమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని నరసన్నపేట ఈఆర్‌ఓ రామ్మోహనరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం నాలుగు మండలాల బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే ఓటరు జాబితాలను పోలింగ్ కేంద్రాల్లో సిద్ధం చేశామని, వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తగా ఓటు నమోదు కోసం, పేరు మార్పు, పోలింగ్ కేంద్రం మార్పు వంటి దరఖాస్తులు వస్తే వెంటనే పరిశీలించి, మీ లాగిన్ నుంచి తహసీల్దార్‌కు పంపాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు పరిశీలించి, ఏమాత్రం అనుమానం ఉన్నా తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. విద్యుత్, ఫర్నీచర్, మరుగుదొడ్లు, ర్యాంప్ కచ్చితంగా ఉండాలన్నారు. తహసీల్దార్ కనకారావు, డీటీ శరత్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం సౌర గృహ పథకంపై అవగాహన



విద్యుత్ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఏఈ రవికుమార్

ఆమదాలవలస రూరల్: సోలార్ విద్యుత్‌తో గృహ వినియోగదారులు విద్యుత్‌ను ఆదా చేసుకోవచ్చునని ఎలక్ట్రికల్ రూరల్ ఏఈ బి.రవికుమార్ తెలిపారు. పట్టణంలోని రూరల్ సెక్షన్ కార్యాలయంలో విద్యుత్ సిబ్బందికి ప్రధానమంత్రి సౌర గృహ పథకంపై శనివారం అవగాహన కల్పించారు. సోలార్ రూఫ్ టాప్ విద్యుత్ పొందడానికి సచివాలయంలో గృహ వినియోగదారులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ పథకంపై గ్రామాల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత విద్యుత్‌శాఖ సిబ్బందిపై ఉందన్నారు. విద్యుత్ వినియోగంలో ఆదాతోపాటు తక్కువ ఖర్చుతో విద్యుత్‌ను సోలార్ ద్వారా పొందవచ్చన్నారు. ఈ పథకం పొందే లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.60 వేల సబ్సిడీ అందించడంతోపాటు మిగిలిన ఖర్చుకు బ్యాంకు ద్వారా రుణం మంజూరు చేస్తుందన్నారు. ఈ పథకం కోసం విద్యుత్ సిబ్బందికి ఆధార్, బ్యాంక్ ఖాతా నంబర్ తెలియజేయాలన్నారు. గ్రామాల్లో ఎనర్జీ అసిస్టెంట్లు, లైన్‌మన్‌లు ఈ పథకం గురించి విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. తక్కువ ఖర్చుతో విద్యుత్ పొందే మార్గాలను ప్రభుత్వం ప్రజలకు అందజేస్తుందని, ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో లైన్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు, లైన్‌మన్‌లు రామస్వామి, టి.కృష్ణారావు, జి.గోవింద పాల్గొన్నారు.

ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి



గ్రామపెద్దలతో మాట్లాడుతున్న డీఎస్పీ బాలచంద్రా రెడ్డి

- టెక్కలి డీఎస్పీ బాలచంద్రా రెడ్డి

జలుమూరు: ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు తిలారు జంక్షన్‌లో జరగనున్న లక్ష్మీనరసింహా స్వామి 26వ వార్షికోత్సవాల జరనున్నాయి. జలుమూరు పోలీస్ స్టేషన్‌లో చిన్నదూగాం గ్రామ పెద్దలతో టెక్కలి డీఎస్పీ కె.బాలచంద్రారెడ్డి శనివారం మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించాలన్నారు. స్వామివారి ఉత్సవాల నిర్వహణకు గ్రామ పెద్దలు సహకరించాలన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, కల్యాణం, దర్శనాలు తదితర కార్యక్రమాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా దేవదాయశాఖతో కలిసి సజావుగా నిర్వహించేందుకు గ్రామ పెద్దలు సమ్మతించారు. నరసన్నపేట సీఐ బూర ప్రసాదరావు, ఎస్‌ఐ మధుసూదనరావు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా శిక్షణ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు

సరుబుజ్జిలి: యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని, యోగా ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగం కావాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు తెలిపారు. ఎన్‌ఎస్‌ఎస్ పీఓ, యోగా శిక్షకులు రమేష్‌సాహు ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు యోగాభ్యాసాలపై శనివారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ధ్యానశక్తితో నూతన ఉత్సాహం కలుగుతుందన్నారు. అధ్యాపకులు నాగేంద్రరామకృష్ణ, ఆకెల్ల రామారావు, శ్రీనివాసరావు, వినోద్‌రాజు పాల్గొన్నారు.